జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
గురువారం 13-08-2026
సంపుటి 1 సంచిక 261
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195




## హైవే 65పై మృత్యు ఘోష! 4

# జీఆర్ఎంబీ అజెండాను మార్చాల్సిందే

### ఏపీ అభ్యంతరాలను అజెండాలో చేర్చడం సరికాదు.. గోదావరి బోర్డుకు తెలంగాణ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 12:** తెలంగాణలో చేపడుతున్న ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలను గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) అజెండాలో చేర్చడాన్ని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా తప్పుపట్టింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలోనే రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్న విషయాన్ని పరి గణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ నెల 18న జరగనున్న గోదావరి బోర్డు సమావేశానికి రూపొందించిన అజెండాపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలను సమావేశం అజెండాలో చేర్చడాన్ని ఆక్షేపిస్తూ నీటి పారుదల శాఖ బోర్డుకు లేఖ రాసింది. తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తంచేయడం ఆక్షేపణీయమని ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటికే కేంద్ర జలసంఘం తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను పరిశీలించి అనుమ తులు మంజూరు చేసిందని తెలిపింది. ఏపీ వాదనలను పక్కన పెట్టి సీడబ్ల్యూసీ తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో, మళ్లీ అవే అభ్యంతరాలను గోదావరి బోర్డు ఎజెండాలో చేర్చడం సరికాదని స్పష్టంచేసింది. బోర్డు సమావేశం అజెండాలో తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలను తొలగించాలని, ప్రస్తుత ఎజెండాను వెంటనే సవరించి కొత్త ఎజెండాను రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు గోదావరి బోర్డుకు రాసిన లేఖలో పలు అంశాలను ప్రస్తావించింది. మరోవైపు, తెలంగాణ ప్రభుత్వం రాసిన లేఖపై తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరుతూ గోదావరి బోర్డు ఏపీ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. దీంతో 18న జరగనున్న బోర్డు సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది.






## గోదావరి జలాలను గరిష్టంగా
# వినియోగించుకోవాలి

### ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేర ఎత్తిపోతలు చేపట్టాలి: సీఎం రేవంత్ రెడ్డి

**దశ, హైదరాబాద్:** గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేర నీటిని ఎత్తిపోసి సాగునీటి అవసరాలకు వినియోగించాలని సూచించారు. ఐసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రాజెక్టుల నీటి లభ్యత, ఎత్తిపోతలు, పెండింగ్ పనులు, ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసం తదితర అంశాలపై చర్చించారు.

### దేవాదుల, సీతారామపై దృష్టి

దేవాదుల ప్రాజెక్టు నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశంలో వివరించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి చిన్నచిన్న సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్దిపాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. పెండింగ్ పరిహారాన్ని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు.

### ముంపు గ్రామాలపై క్షేత్రస్థాయి పరిశీలన

నీటిపారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించాలని సీఎం సూచించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ పనులను త్వరగా పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీటిని నింపే అవకాశం ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

### ఎత్తిపోతల సామర్థ్యంపై అధ్యయనం

గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచే అంశంపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు

..మిగతా 4వ పేజీలో →

# షార్ట్‌కట్‌లతో ముప్పే

**నేరుగా రైల్వేట్రాక్‌లను దాటడం ప్రమాదకరం**
**లక్ష్యసాధనలో తొందరపాటు నిర్ణయాలొద్దు**
**ఇన్‌ఫ్లుయెన్సర్ల ఉచ్చులో పడొద్దు**
**మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ పుస్తకావిష్కరణలో 'జెన్ జీ'కి ప్రధాని నరేంద్ర మోదీ సూచనలు**

**ఢిల్లీ, ఆగస్టు 12:** జీవితంలో త్వరగా లక్ష్యాన్ని చేరుకోవాలనే తొందరలో ఎంచుకునే షార్ట్‌కట్ మార్గాలు ఒక్కోసారి తీవ్ర నష్టాలకు దారితీస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

..మిగతా 4వ పేజీలో →

# నేడు సీఎం భూమిపూజ

### కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు సీఎం రేవంత్ శ్రీకారం

**ప్లాట్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు**
**అన్ని కేటగిరీల్లో మహిళలకు 30 శాతం**
**16 నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద 7,340 ఫ్లాట్ల నిర్మాణం**
**సర్కార్ సబ్సిడీ రూ. 5 లక్షలు.. లబ్ధిదారుడి వాటా రూ.6 లక్షలు**
**లబ్ధిదారుడి వాటా విడతల వారీగా చెల్లించేందుకు అవకాశం**



**హైదరాబాద్, ఆగస్టు 12:** హైదరాబాద్ సిటీలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సీఎం శ్రీకారం చుట్టనున్నారు. రిజర్వేషన్ల ప్రకారం.. ఫ్లాట్ల కేటాయింపు జరగనుంది. అన్ని కేటగిరీల్లో మహిళలకు 30 శాతం కేటాయించనున్నారు. హైదరాబాద్ పరిధిలో మొత్తం లక్ష ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటు ధరల్లో సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తోంది. క్యూర్ పరిధిలో 12 వేల ఫ్లాట్లతో పైలట్ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. తొలి దశలో 18 చోట్ల 7,340 ఫ్లాట్ల నిర్మాణం చేపడుతుంది. హైదరాబాద్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీటిని నిర్మించనున్నారు. రూ.807.40 కోట్లతో వీటి నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఒక్కో ఇందిరమ్మ ఇల్లు 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరి యా, 528 చదరపు అడుగుల బిల్టప్ ఏరి యా ఉంటుంది. ఒక్కో ఫ్లాట్‌కు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుండ గా, మిగతా రూ.6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించా ల్సి ఉంటుంది. రూ.6 లక్షల వరకు కుటుంబ వార్షిక ఆదాయం ఉన్న వారు ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయిం చింది. దరఖాస్తుదారుడికి క్యూర్ పరిధిలో సొంత ఇల్లు, ప్లాట్ లేదా ఫ్లాట్ ఉండకూడదు. ఒక కుటుంబానికి ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయిస్తారు. దరఖాస్తుదారులు తాము నివసిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టుకే దరఖా స్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలో ఎలాంటి సర్టిఫికెట్లు అవసరం లేదని, అయితే దరఖాస్తు ఫీజు రూ.100, టోకెన్ అడ్వాన్స్ రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఫ్లాట్ అలాట్ కాకపోతే ఈ డబ్బును ప్రభుత్వం తిరిగి ఇస్తుంది. ఫ్లాట్ కేటాయింపు జరిగితే ఆ మొత్తాన్ని లబ్ధిదారుడి వాటాలో సర్దుబాటు చేస్తారు.

### 15 దాకా దరఖాస్తుల స్వీకరణ

మీసేవ కేంద్రాలు, మీ సేవ వాట్సాప్ సర్వీస్ 8096958096 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచిం చింది. ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 15 చివరి తేదీ కాగా, అర్హతలను పరిశీలించిన అనంతరం

..మిగతా 4వ పేజీలో →



పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి క్రమం తప్పకుండా సభకు హాజరవుతున్నానని అమిత్‌షా చెప్పా రు. 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి వ్యాఖ్యలు పార్లమెంటరీ చర్చల్లో వినిపిస్తున్నాయని ప్రస్తావించారు. తాను తన ఛాం బర్‌లోనే ఉంటున్నానని, ఉభయ సభలను విపక్షాలు సాగనివ్వకుండా చేస్తే సభకు వచ్చి ఏం చేయగలనని ప్రశ్నించారు.

# అమిత్ షా x రాహుల్!

**విద్యార్థులపై లాఠీచార్జికి చర్చకు సిద్ధమన్న కేంద్ర హోంమంత్రి**
**అవసరమైతే 24 గంటలు సభలో చర్చిద్దామని విపక్షాలకు సవాల్**
**లాఠీచార్జిపై సూటిగా సమాధానం కావాలన్న రాహుల్**
**కాల్పులకు ఆదేశాలిచ్చింది ఎవరో చెప్పాలని డిమాండ్**

న్యూఢిల్లీ, ఆగస్టు 12 : నీట్ పేపర్ లీక్, ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలు, లాఠీచార్జి అంశాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను మరింత వేడెక్కించాయి. ప్రతిరోజు విపక్ష సభ్యులు ఈ అంశాలపై ఆందోళనలు చేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని

..మిగతా 4వ పేజీలో →



# క్యామ మల్లేష్ ను పరామర్శించిన టిఆర్ఎస్ నేతలు

**దశ, హైదరాబాద్ :** శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేష్ను పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు క్యామ మల్లేష్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న నాయకులు, మల్లేష్ త్వరగా

..మిగతా 4వ పేజీలో →

# కానిస్టేబుల్ ఆత్మహత్య!

## పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

**ఎల్బీనగర్, ఆగస్టు 12:** ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయ బాత్‌రూంలో బుధవారం తెల్లవారుజామున ఓ కానిస్టేబుల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఇది ఆత్మహత్య కాదని, హత్యేనని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలంటూ ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం 9 గంటల పాటు ఆందోళన చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం బండాలేమూర్ గ్రామపంచాయ తీ పరిధిలోని అజ్జిన తండాకు చెందిన జర్పు ల బోధ్య(55), విజయ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహం కాగా, కుమారులకు వివాహం కాలేదు. పెద్ద కుమారుడు జె సేవాళ్ (27) ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు జె సాయికుమార్ (25) ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2024 బ్యాచ్‌కు చెందిన సాయికుమార్ కర్మన్‌ఘాట్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి విధుల నిమిత్తం ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి వెళ్లిన సాయికుమార్.. అక్కడి బాత్‌రూంలో బుధవారం తెల్లవారుజామున ఉరేసుకున్నట్టు తోటి ఉద్యోగులు గుర్తించినట్టుగా తెలిసింది.

# అమిత్ షా x రాహుల్!

**మొదటి పేజీ తరువాయి**

పట్టుబడుతు న్నాయి. ఈ నేపథ్యంలో స్పందించిన అమిత్ షా.. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అవసరమైతే 24 గంటల పాటు సభను నిర్వహించి ప్రతి అంశంపైనా చర్చిద్దామని, విపక్ష సభ్యులు లేవనెత్తే ప్రతి ప్రశ్నకు తానే సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు. అయితే అమిత్‌షా ప్రతిపాదనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. తమకు హోంమంత్రి లెక్చర్లు అవసరం లేద ని, విద్యార్థులపై కాల్పులు, లాఠీచార్జికి ఆదేశాలిచ్చింది ఎవరో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

### అమిత్‌షా సవాల్..

ఢిల్లీ ఘటనలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు సిద్ధమని స్పష్టం చేసిన అమిత్‌షా .. ప్రతిపక్షాలకు 24 గంటల చర్చకు సవాల్ విసిరారు. ప్రతిపక్షాలు బుధవారం మధ్యా హ్నం 2 గంటలలోపు స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు మధ్యా హ్నం 3 గంటల వరకు 24 గంటలపాటు చర్చ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చర్చలో స్వయంగా పాల్గొంటానని, విపక్ష సభ్యుల ప్రతి ప్రశ్నకు పాయింట్ల వారీగా సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు.

### దాచడానికి ఏమీ లేదు..

నీట్ పేపర్ లీక్, విద్యార్థుల ఆందోళనల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి దాచాల్సిందేమీ లేదని అమిత్‌షా అన్నారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభు త్వం చర్చకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. అయితే పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకోవడం ద్వారా ప్రజా సమస్య లపై చర్చకు అవకాశం లేకుండా చేయడం సరికాదని విపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తీవ్రమైన అంశాలను సభలో కేవలం ఒక ప్రకటనతో ముగించలేమని అమిత్‌షా స్పష్టం చేశారు. పార్లమెంటులో చర్చకు నిర్దిష్టమైన నియమ నిబంధనలు ఉన్నాయని, వాటి ప్రకారమే సమగ్ర చర్చ జరగాలని అన్నారు. అవసరమైతే స్పీకర్ అనుమతితో ప్రశ్నోత్తరాల సమయాన్ని వాయిదా వేసి చర్చ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. సభలో ప్రకటన చేసి వెళ్లిపోవడం పార్లమెంటరీ విధానం కాదని, సభ్యులు లేవనెత్తే అంశాలపై పూర్తిస్థాయిలో చర్చ జరగాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### ప్రతి రోజూ పార్లమెంట్‌కు వస్తున్నా..

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి క్రమం తప్పకుండా సభకు హాజరవుతున్నానని అమిత్‌షా చెప్పా రు. 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి వ్యాఖ్యలు పార్లమెంటరీ చర్చల్లో వినిపిస్తున్నాయని ప్రస్తావించారు. తాను తన ఛాం బర్‌లోనే ఉంటున్నానని, ఉభయ సభలను విపక్షాలు సాగనివ్వకుండా చేస్తే సభకు వచ్చి ఏం చేయగలనని ప్రశ్నించారు. హంగామా చేయడం మానేసి చర్చకు రావాలని, నిర్ణ యం వారి చేతుల్లోనే ఉందని, అర్థవంతమై న చర్చ కావాలా.. సభలో రచ్చ కొనసాగించాలా విపక్షాలే తేల్చుకోవాలని అన్నారు.

### మాకు లెక్చర్లు వద్దు : రాహుల్

హోంమంత్రి లోక్‌సభలో ఇచ్చే ఉపన్యాసాలు వినేందుకు విపక్షాలు, దేశ యువత సిద్ధంగా లేదని రాహుల్‌గాంధీ అన్నారు. తమకు లెక్చర్లు అవసరం లేదని, విద్యార్థులపై జరిగిన చర్యలకు సంబంధించిన ప్రశ్న లకు స్పష్టమైన సమాధానాలు మాత్రమే కావాలని తేల్చిచెప్పారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కాల్పులు జరపాలని ఎవరు ఆదేశించారో హోం మం త్రి చెప్పాలని డిమాండ్ చేశారు. 'మేకులున్న లాఠీలతో కొట్టేందుకు ఆదేశాలు ఎవరి చ్చా రో వెల్లడించాలన్నారు. ఆదేశాలు ఆయనే ఇచ్చి ఉంటే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఒకవేళ ఆయనకు తెలియకుండానే ఈ ఘోరం జరిగి ఉంటే ఆయన ఈ పదవికి పనికిరారు. హోంమంత్రికి సభకు వచ్చి మ మ్మల్ని ఎదుర్కొనే ధైర్యం లేదు. నిజం చెప్పే సాహసం లేకనే దాక్కుంటున్నారు. ఆయన మౌనమే ఆయన నేరాన్ని అంగీకరించినట్లు స్పష్టం చేస్తోంది. సభలో ఊహాజనిత కబుర్లు చెప్పడం మాకు అవసరం లేదు. కాల్పులకు బాధ్యులెవరో స్పష్టంగా తేల్చాలి. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా ఇద్దరికీ నిజాలను ఎదుర్కొనే గుండెధైర్యం లేదు' అని రాహుల్ విమర్శించారు. ఇదిలా ఉండగా సాధారణ చర్చతో సమస్యను పక్కదారి పట్టించవద్దని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి.




# వినియోగించుకోవాలి

**మొదటి పేజీ తరువాయి**

సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించాలని సూచించారు.


### బ్యారేజీల్లో నీటి నిల్వపై NDSA సూచనలే కీలకం

సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) సూచనల మేరకే నీటిని నిల్వ చేయడం లేదని సీఎం స్పష్టం చేశారు. NDSA సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశంలో వివరించారు. ఈ అంశంపై NDSAతో సంప్రదించి తదుపరి చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు.

# క్యామ మల్లేష్ ను పరామర్శించిన టిఆర్ఎస్ నేతలు

**మొదటి పేజీ తరువాయి**

సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు ధైర్యం చెప్పి, ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్యామ మల్లేష్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజా జీవితంలో చురుగ్గా పాల్గొనాలని నాయకులు ఆకాంక్షించారు.




# హైవే 65పై మృత్యు ఘోష!

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 12:** సంగారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి 65 రక్తాశ్రువులు కురిపిస్తోంది. నిత్యం వేలాది వాహనాలతో బిజీగా ఉండే ఈ హైవే అమాయక ప్రయాణికుల పాలిట యమపాశంగా మారుతోంది. మంగళవారం రాత్రి జిల్లా పరిధిలో జరిగిన రెండు ఘోర ప్రమాదాలు పలు కుటుంబాల్లో తీరని చీకట్లను నింపాయి. మొగడంపల్లి మండలం సత్వర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న ఒక ఆటోను, ఎదురుగా అతివేగంతో వచ్చిన ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు కర్ణాటకకు చెందిన వలస కూలీలు అక్కడికక్కడే మరణించారు. అలాగే హైవేపై కావేలి గ్రామ పరిధిలో జరిగిన మరో ప్రమాదంలో నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఒక కారు అదుపు తప్పి రోడ్డు డివైడర్ను ఢీకొట్టి, అవతలి వైపు వస్తున్న వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. నాలుగు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పోలీస్, జాతీయ రహదారుల సంస్థ రికార్డుల ప్రకారం, తెలంగాణలోనే అత్యధిక ప్రమాదాలు జరిగే అత్యంత ప్రమాదకరమైన రోడ్డుగా జాతీయ రహదారి 65 రికార్డుకెక్కింది. హైవేపై వాహనాలు నియంత్రణ లేని వేగంతో దూసుకుపోవడమే ప్రమాదాలు జరుగుతున్నాయి. లింగంపల్లి నుంచి సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు జరుగుతున్న ఆరు లేన్ల విస్తరణ పనుల వల్ల కనీస హెచ్చరిక బోర్డులు లేకపోవడం, శాస్త్రీయత లేని మలుపులు, యూటర్నుల వద్ద రక్షణ చర్యలు కరువవ్వడమే కారణమని తెలుస్తోంది.

### రహదారి భద్రతా లోపాలు..

కేవలం డ్రైవర్ల తప్పుల వల్లే కాకుండా, రోడ్డు నిర్వహణ లోపాల వల్ల కూడా ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. మొగడంపల్లి మండలం సత్వర్ వద్ద జరిగిన ప్రమాదానికి ప్రధాన కారణం యూటర్న్. హైవేపై వాహనాలు 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వస్తున్నప్పుడు, ఎలాంటి ముందస్తు హెచ్చరిక బోర్డులు లేకుండా సడన్గా యూటర్న్లు రావడం మరణశాసనంగా మారుతోంది. నేషనల్ హైవేస్ అథారిటీ గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ఇప్పటికీ సరైన బ్లింకర్ లైట్లు లేదా రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం సంగారెడ్డి కంది నుంచి మడిగెల్ వరకు జాతీయ రహదారి 65పై ఆరు లేన్ల విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు తవ్వకాలు జరిపిన చోట, డైవర్షన్లు ఇచ్చిన చోట కనీస రేడియం సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు పెట్టడం లేదు. రాత్రి వేళల్లో లైటింగ్ లేకపోవడంతో డ్రైవర్లు అకస్మాత్తుగా బ్రేకులు వేయడం వల్ల వాహనాలు అదుపు తప్పుతున్నాయి. హైవే ఇరుపక్కలా ముఖ్యంగా హోటళ్లు, డాబాల వద్ద భారీ వాహనాలను (కంటైనర్లు, ట్యాంకర్లు) రోడ్డుపైనే ఇష్టానుసారంగా పార్క్ చేస్తున్నారు. వీటి వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలకు రోడ్డు సరిగ్గా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు వీటిని నియంత్రించడంలో విఫలమవుతున్నారు. అన్ని ప్రధాన క్రాసింగ్లు, యూటర్న్ల వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని తగ్గించాలి. ఓవర్ స్పీడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ను అడ్డుకోవడానికి స్పీడ్ గన్లు, సీసీ కెమెరాల నిఘా పెంచాలి. విస్తరణ పనులు జరుగుతున్న జోన్లలో రాత్రి వేళల్లో స్పష్టంగా కనిపించేలా ఎల్ఈడీ బ్లింకర్లను వెంటనే అమర్చాలి.

### కాంగ్రెస్‌లో.. చెయ్యి కలపని నేతలు

**నిర్మల్ ,ఆగస్టు 12:** నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో ఐక్యత మరో సారి బెడిసి కొట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్, నామినేటెడ్ పదవుల పంచాయతీ మూడు వర్గాల మధ్య మరోసారి విభేదాలు ఏర్పడి సమావేశం వాడిగా వేడిగా జరిగిన ట్లు ప్రచారం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన జిల్లా కాంగ్రెస్లో ఐక్యత ఇంకా కనిపించడం లేదని కాంగ్రెస్ నాయకులు బ హిరంగంగా విమర్శిస్తున్నారు. నిర్మల్ జిల్లా లో నిర్మల్ ఖానాపూర్ ముధోల్ నియోజకవర్గం లు ఉండగా ఖానాపూర్ లో మాత్రమే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

# నేడు ఇందిరమ్మ ఇం డ్లు భూమిపూజ

**మొదటి పేజీ తరువాయి**

లాటరీ విధానంలో ఫ్లాట్లను కేటాయి స్తారు. ఫ్లాట్ల కేటాయింపు ల్లో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, క్లాస్4, పారి శుధ్య కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ ఉంటుం ది. మిగిలిన 50 శాతం ఫ్లాట్లు జనరల్ కేటగిరీకి కేటాయి స్తారు. అన్ని కేటగిరీలో 30 శాతం ఫ్లాట్లను మహిళలకు రిజర్వ్ చేస్తారు. ప్రొవిజనల్ అలాట్ మెంట్ సమయంలో రూ.1 లక్ష, ఆర్‌సీసీ నిర్మాణం పూర్తయ్యాక రూ.2 లక్షలు, ఫినిషింగ్ దశలో మరో రూ.2 లక్షలు, మిగిలిన మొత్తాన్ని ఫ్లాట్ అప్పగించే సమయంలో చెల్లించాల్సి ఉంటుంది.




**కేబీహెచ్‌బీ కాలనీలో 480 ఇండ్ల నిర్మాణం**

ముఖ్యమంత్రి భూమిపూజ చేయనున్న కేపీహెచ్‌బీ కాలనీలో 480 ఇందిరమ్మ ఇం డ్లు ఫ్లాట్ల నిర్మాణం ప్రతిపాదించారు. ఇక మల్కాజిగిరి లోని కొకూర్‌లో, శేరిలింగంపల్లి రాయదుర్గంలో, మ హేశ్వరం జల్‌పల్లిలో, నాంపల్లిలో రెడ్‌హిల్స్, నీలోఫర్ సైట్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనున్నారు. సనత్‌నగర్ లోని పాటిగడ్డ, మలక్‌పేట్‌లోని గడ్డిఅన్నా రం, ఇబ్రహీం పట్నం బండ్లగూడ, మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారం, రాజేంద్రనగర్‌లోని మైలార్‌దేవర్‌పల్లి, కుత్బుల్లాపూర్ లోని గాజులరామారం, ఖైరతాబాద్ పరిధిలో హకీంపేట్ దర్గా వద్ద, జూబ్లీహిల్స్, అం బర్‌పేట సిటీ పోలీస్ లైన్స్, సికింద్రా బాద్ కంటోన్మెంట్‌కు సంబంధించి బోయిన్‌పల్లిలో, కార్వాన్ నియోజవర్గంలో కుల్సుంపు రా పోలీస్ క్వార్టర్స్‌లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మించనున్నారు.

★ ఇది రీల్స్ యుగం. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు వాళ్ల మార్గంలో యువతను తీసుకెళ్తుంటారు. ఇది షార్ట్‌కట్‌ల కాలం కూడా. అలా షార్ట్‌కట్‌లతోనే జీవితం సాగించాలనుకుంటే.. మీరు బాగా ఇష్టపడేవారి ఆత్మకథ చదవాలి. కోవింద్ లాంటివారు భవిష్యత్‌లోనూ మనకు అవసరం. ఎంత గడ్డు పరిస్థితులు వచ్చినా.. ఎంచుకున్న మార్గం వీడకుండా సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు వెళ్లాలి.

ప్రధాని నరేంద్ర మోదీ



# షార్ట్‌కట్‌లతో ముప్పే

**మొదటి పేజీ తరువాయి**

హెచ్చరించారు. ముందుకు సాగాలంటే అర్థ వంతమైన, సరైన మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. మాజీ రాష్ట్ర పతి రామ్‌నాథ్ కోవింద్ రాసిన ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిప బ్లిక్ లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం ఉదయం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో 'జెన్ జీ'ని యువతకు పలు సూచనలు చేశారు. కొందరు ఫుట్‌బ్రిడ్జ్‌లను ఉపయోగించకుండా రైల్వే పట్టాలను దాటుతుంటారని, ఇలాంటి ప్రమాదకరమైన నిర్ణయాల వల్ల కలిగే నష్టాలను తెలియజేసేందుకే రైల్వే స్టేషన్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. 'ఏ షార్ట్ కట్ విల్ కట్ యూ షార్ట్' అని ఆ బోర్డులు హెచ్చరికలు చేయడమే కాకుండా, జీవితానికి పాఠాలు నేర్పుతాయన్నారు. ప్రస్తుతం యువతపై ఇన్‌ఫ్లు యెన్స ర్లు, రీల్స్ తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వీటి ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించారు.

### స్ఫూర్తి పొందాలి..

నేటి డిజిటల్ యుగంలో 'జెన్ జీ'లో ఏకాగ్రత, లోతైన ఆలోచన శక్తి తగ్గిపోతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సమయం వృథా చేయకుండా, జీవితంలో నిజమైన పాఠాలు నేర్చుకోవడానికి మహనీయులు, నాయకుల ఆత్మకథలను చదవాలన్నారు. ఆత్మకథలు చదవటం వల్ల వారు ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాల నుంచి ఎంతో నేర్చుకోవచ్చన్నారు. పుస్తకపఠం వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే కాకుండా, సమా జం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందిస్తుందన్నారు. యువత డిజిటల్ యుగానికి పరిమితం కాకుండా నిరంతరం పుస్తకాలు చదవడం కొనసాగించాలని, దేశానికి సేవ చేసిన వారి అనుభవాలను చదివి స్ఫూర్తి పొందాలని స్పష్టం చేశారు. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరువాలంటే ఎప్పటికైనా కష్టపడే తత్వమే విజయాన్ని ఇస్తుందన్నారు.

### కోవింద్‌పై మోదీ ప్రశంసలు..

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌పై ప్రధాని ప్రశంసలు కురిపించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన రామ్‌నాథ్ కోవింద్ జీవితం పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఎన్నో కష్టాలను కిగా ఎదుర్కొని దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధి రోహించారని పేర్కొన్నారు. రాష్ట్రపతి పదవి నుంచి విరమణ చేసిన తర్వాత కూడా కోవింద్ విశ్రాంతి తీసుకోకుండా దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' (జమిలి ఎన్నికలు) వంటి అంశా లపై ఆయన కొనసాగిస్తున్న కృషి దేశ సేవ పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. కోవింద్ చిన్ననాటి విషాదాన్ని గుర్తుచేసుకున్న ప్రధాని మోదీ భావోద్వేగానికి గురయ్యారు. బాల్యంలో వారి ఇల్లు అగ్నిప్రమాదానికి గురైనప్పుడు వస్తువులను కాపాడేందుకు ప్రయత్నించిన కోవింద్ తల్లి ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రస్తావించారు. కోవింద్ ఆత్మకథ శీర్షిక ఎంతో అద్భుతంగా ఉందని, ఆయన జీవితంలో ఎదుర్కొన్న పోరాటాలు వ్యక్తిగతమైనవి అయినప్పటికీ.. వాటి ద్వారా సాధించిన విజయం మాత్రం భారత ప్రజాస్వామ్యానిదే నని అభివర్ణించారు.

### అదానీ కోసం దేశం తాకట్టు ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు

అదానీకోసం ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, రాజీ పడ్డారని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. గౌతమ్ అదానీకి సంబంధించిన కేసును అమెరికా కోర్టు కొట్టివేయడంతో మోదీపై రాహుల్ ఆరోపణలు సంధించారు. దేశ ప్రయోజనాలను అమ్ముకోవాల్సి ఎందుకు వచ్చిందో చెప్పాలన్నారు. దీనివెనుక కంటికి కనిపించే దానికంటే ఎక్కువ ఉందని విమర్శించారు. అదానీకోసం దేశం భారీ మూల్యం చెల్లిస్తోందని మండిపడ్డారు. అమెరికా కోర్టు గౌతమ్ అదానీ, ఆయన సోదరుడు సాగర్ అదానీలపై కేసు కొట్టివేసిన అంశానికి సంబంధించి స్క్రీన్‌షాట్‌ను రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేసి మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 2024 నంబర్‌లో గౌతమ్, సాగర్ అదానీలతో సహా వినీత్ జైన్ తదితరులపై విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన ఒప్పందాలలో లంచాలు చెల్లించారనేది ప్రధాన ఆరోపణ.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com